# గ్రీష్మంలో వసంతం

— కొలికపూడి రేఖ



జ్యోతిర్మయి నవ్వింది.

అణగారిపోయిన ఏనాటి అనుభూతో మనోసైకత తీరాల కవతల కాంతి పుంజమై వెలిసి వెలిగినట్టు....

శీతాకాలపు ప్రభాతాన గులాబీరేకు మీద తొలి ఉషః కిరణం కోసం తపస్సు చేస్తున్న తుషార బిందువులా...

నవీన్ ఆమెనే చూస్తున్నాడు.

ఎప్పుడు చూసినా, ఎన్నిసార్లు చూసినా ఆమె అతనికో అద్భుతంలా అనిపిస్తుంది.

"ఏమిటలా చూస్తున్నావ్?"

చిగురాకు తిన్న గండుకోయిల కూజితంలో వినిపించే రవ్వంత జీర ఆమె కంఠంలో...

"నిన్ను కాదు" అన్నాడు నవీన్.

"మరి?"

"నీ నవ్వును"

ఆమె పెదవులు బిగించింది. కానీ ఆమె కళ్లు నవ్వుతున్నాయి అలా కళ్లతో అందంగా నవ్వటం ఒక్క జ్యోతిర్మయికే సాధ్యం.

ఆరాదనగా ఆమెను చూస్తూ అనుకున్నాడతను.

"ఏమంటుంది మీ ఆవిడ?" అడిగింది జ్యోతిర్మయి.

పరవశంగా వింటున్న చిట్టిబాబు వీణా నాదంలో అపశృతి కలిగిన ఫీలింగ్.

"ఇప్పుడామె సంగతెందుకు?" చిరాగ్గా అన్నాడు నవీన్.

జ్యోతిర్మయి నవ్వలేదు.

ఓ క్షణం అతడిని సీరియస్‌గా చూసింది.

"మరే సంగతి మాట్లాడుకుందాం? అంది.

తలెత్తి చూశాడు నవీన్.

ఆమె ముఖంలో కనిపిస్తున్న గాంభీర్యాన్ని చూసి, ఆమె నుంచి చూపు మరల్చుకుని ఆమె వెనుకగా బాల్కనీలోంచి కనిపిస్తున్న విభాత సంజెను చూస్తున్నాడు.

"ప్రభాతమా? విభాతమా? నీకేదిష్టం?"

తన కళ్లలోకి చూస్తూ జ్యోతిర్మయి.

"నువ్వు ప్రక్కనుంటే ఏ భాతమైనా ఒక్కటే నాకు."

ఆరాధనగా ఆమె చేయి పట్టుకుని తను...

"విఘాతమైనా?"

"జ్యోతి."

ఆకాశం నుంచి నక్షత్రాలు రాలిపడుతున్నట్టు ఆమె నవ్వు.

తల విదిలించాడు నవీన్.



మనస్సు అట్టడుగు పొరల మధ్య నిక్షిప్తమై, అపురూపంగా దాచుకున్న అనుభవాల సుమాలు- తిరిగి పరిమళిస్తున్నాయి.

అతని సంజెనెవరో బలంగా పిండినట్టని పించింది.

అవును.

ఈ క్షణం వరకూ అది తీయని స్మృతి.

భవిష్యత్తులో తీయగా గుండెను కోసే జ్ఞాపక శకాలలావుతాయి.

గడిచిపోయే ప్రతి నిమిషం కాల సముద్రంలో కలిసిపోయే ఓ బిందువైతే...

కరిగిపోయిందనుకున్న ప్రతీ అనుభూతీ వర్తమానంలో ఘనీభవించి భవిష్యత్తులో కరిగి నిప్పురవ్వల్లా మనస్సును మండించే అనుభవాల కొలిమవుతుంది.

కాలానికి ఎదురీదే మనిషి అనుభూతి ముందు ఎంత బలహీనుడు?

జ్యోతి లేచి నిల్చుని-బాల్కనీ గోడకాను కుంది.

కొద్దిసేపట్లో ఆగమించబోయే చంద్రుడిని తలచుకుని సిగ్గుతో ఎర్రబడుతున్న ఆకాశాన్ని చూస్తోంది.

కెంజాయి కాంతి రేఖలు ఆమె ముఖం మీద విశ్లేషణ చెంది ఆమె మరింత అందంగా కనిపిస్తోంది.

సిగరెట్ వెలిగించాడు నవీన్.

"ఆనందమా? విషాదమా?"

తలతిప్పి అడిగింది జ్యోతిర్మయి.

ఆనందం ఎక్కువైనా విషాదం భరించలేక పోయినా-

అప్పుడు తప్ప ఆమె ముందు సిగరెట్ కాల్చనని చెప్పాడతను. చిన్నగా నవ్వాడు నవీన్.

"నీకు తెలుసు" అన్నాడు.

ఐదు సంవత్సరాల పరిచయం ఏర్పర్చిన చనువునుమించిన ఏదో భావం అతని కళ్లలో కనిపిస్తోంది.

"ఇంక నాలుగు రోజులే ఉంది." అందామె.

"ఇంకో నాలుగు రోజుల్లో నువ్వు ఉరితీయ బడతావ్." జైలు వార్డెర్ చెప్పినట్టనిపించిందతనికి.

"తెలుసు" తలదించుకుని అన్నాడు.

"ఇంకా ఆలోచించటానికేముంది గనుక అలా ఆలోచిస్తున్నావ్?" నవ్వుతూ అడిగింది.

నవీన్ మాట్లాడలేదు.

అవును. ఏమీలేదు.

తన ప్రమేయం లేకుండానే అంతా అయి పోయింది.

నాలుగురోజుల్లో తను కాలసముద్రంలో కలిసిపోయే సింధువై గతం మిగిల్చిన జ్ఞాపకాల నిప్పురవ్వలు గుండె కొలిమిరగిలిస్తుంటే...

"నీకిష్టమైతే విడాకులు తీసుకో. అంతేగానీ ఇంకెప్పుడూ నా జీవితంలోకి ప్రవేశించే ప్రయత్నం మాత్రం చేయకు".

భార్య మాటలు గుర్తొచ్చాయతనికి.

బాధగా నవ్వుకున్నాడు.

కవిత్వం కాదు కరెన్సీనోట్లు కావాలి.

భావుకత్వం కాదు లాభాలు రావాలి.

అనుభూతి అనురాగం ఆత్మీయత

వీటన్నిటికన్నా ముఖ్యమైంది

డబ్బు!!

**పురుటి నొప్పులు లేని కానుపు**

రష్యన్ శాస్త్రవేత్తలు - ఇంజనీర్లు కలిసి పురుటినొప్పులు లేకుండా పండంటి బిడ్డల్ని కనడానికి ఒక విద్యుత్ సాధనాన్ని రూపొందించారు.

ప్రమాదకరమైన కాన్పు సమయంలో తల్లులు యమయాతన అనుభవించనక్కరలేకుండా యీ సాధనం రక్షిస్తుంది. ప్రసవించనున్న స్త్రీ నుదుటికి ఆ సాధనానికి అమర్చివున్న ఎలక్ట్రోడ్సు తగిలించి మెదడులో బాధను ప్రతిఫలించి నరాలకు అందజేసే నాడీ కేంద్రాలను మొద్దు బరుస్తారు. నాడీ మండలం కార్యకలాపాలవేగాన్ని యీ సాధనం అదుపు చేస్తుంది. ఉద్రేకతరంగాలను ఉపశమింపచేస్తుంది.

మాస్కో ప్రసూతి పరిశోధనా సంస్థకు చెందిన డాక్టరు ఎడ్వర్డ్ కస్త్రుబిన్ యీ సాధనం సృష్టికి మూలకారకుడు. ప్రసూతి సంబంధమైన తీవ్ర రుగ్మతలను నయం చేయడానికి కూడా యీ సాధనం ఉపకరిస్తుంది. అంగర శ్రీదేవి

నెలకు అయిదువేలు ఆమె ఖర్చుకింద ఇస్తున్నప్పుడు...

ఆమె పుట్టినరోజు మారుతీకారు తాళాలు చేతికిస్తున్నప్పుడు... తను ఆశించింది కేవలం రెండక్షరాల 'థాంక్స్' మాత్రం కాదు. అంతకు మించి-

ఇంకా ఏదో - ఏదో కావాలి తనకు.

దానికి భాష అవసరంలేదు. కవిత్వం అక్కర్లేదు.

కేవలం -

ఆత్మీయత నిండిన ఓ చూపు.

కళ్లలో ఆర్ద్రత నింపిన చెమ్మదనం.

కేవలం ఓ రెటీనా, సున్నితమైన కొన్ని రక్తనాళాలు కలిగి - కనురెప్పల కావలిలో ఉన్న ఇంద్రియం కళ్లు -

కాటుక దిద్దటం రొటీన్.

కనుబొమలు ట్రిమ్ చేయించుకోవటం ఫ్యాషన్.

దట్సాల్.

కళ్ల అవసరం అంతే.!!

కానీ - మనస్సుకు దేవుడిచ్చిన నిశ్శబ్ద కంఠం కళ్లు అని ఎంతమందికి తెలుసు?

"నా కంటి పాపల్లో నీ రూపం నిక్షిప్తం చేసుకున్నాను గనుక, నా మనస్సులో నీ జ్ఞాపకాలు ఎప్పటికీ చెదిరిపోవు."

తోటలో మల్లెపందిరి కింద కూర్చున్నప్పుడు జ్యోతిర్మయి అన్న మాటలు ఎంత నిజం?!!

"చలిగా ఉంది. లోపలికెళ్దామా?"

తలెత్తి చూశాడు నవీన్.

తలమీద ఒంటరి నక్షత్రం మెరుస్తుండగా

నవ్వుతోంది జ్యోతిర్మయి.

నెమ్మదిగా లేచి నిల్చున్నాడు.

బాల్కనీలోంచి హాల్లోకొచ్చారు.

బాల్కనీ తలుపు వేయబోతుండగా వారించాడతను.

అతని భావం ఆమెకర్థమై వెనక్కు తిరిగి చూసింది.

చంద్రుడు తన తొలికిరణం ఆకాశంలో సంధించాడు.

"ప్రకృతిని ఆరాధించేవాడివి బిజినెస్ ఎలా చేయగలుగుతున్నావ్?" నవ్వుతూ అడిగింది జ్యోతిర్మయి.

అతను మాట్లాడలేదు.

ఆ ప్రశ్న ఆమె గతంలో చాలాసార్లు అడిగింది.

తను స్పష్టంగా చెప్పాడు కూడాను.

వేసవికాలపు సాయంత్రాలు - చలికాలపు ఉదయాలు - వర్షాకాలపు రాత్రిళ్లు ఆనందించటానికి బిజినెస్ ఎందుకడ్డొస్తుందో తనకు అర్థం కాని విషయం.

"ఎందుకంటే అవి ఆనందించే సమయంలో కూడా బిజినెస్ గూర్చి ఆలోచిస్తే ఇంకా లాభాలొచ్చి జీవితంలో ఎంతో ఎదగొచ్చుగనుక" భార్యమాటలు గుర్తొచ్చి.

అతను బాధపడలేదు.

కవిత్వం భావుకత్వం జీవితంకాదని తెలుసు.

కానీ వాటిని జీవితంలో ఓ భాగంగా కూడా భరించలేని మనుషులను చూస్తే అతనికి జాలి.

నైట్క్వీన్ పరిమళాన్ని ఆస్వాదిస్తూ తోటలో కూర్చున్నాడు.

ముక్కుపుటాలు అదిరిపోయేలా కునేగాతో వచ్చి కూర్చునే భార్యకు తనేం చెప్పగలడు?

నవ్వుకున్నాడతను.

జ్యోతిర్మయి నవ్వుతోంది.

"చాలాకాలమైంది కదూ మనం ఇలా కూర్చుని"

అతనికెదురుగా కుర్చీలో కూర్చుంటూ అంది.

"అవును - అవునవును"

"ఓ నిజం చెప్పనా నవీన్"

ఎర్రని ఆమె పెదవుల కంటిన ఆరంజి జ్యూస్ ఆ అదృష్టానికి పొంగిపోతున్నట్టు షాండ్లేర్ కాంతిలో తళుక్కున మెరిసింది. నవీన్ చెప్పమనట్టు చూశాడు.

"ప్రేమకూ పెళ్లికీ చుక్కెదురని నా ఉద్దేశం... ఆగు.... నన్ను చెప్పనీ.. ఎందుకంటే - ప్రేమికులు పెళ్లిచేసుకుంటే కోటానుకోట్ల దంపతుల్లో వారూ ఒకరవుతారే తప్ప ఏ ప్రత్యేకతా ఉండదు. సపోజ్ మీ ఆవిడకు విడాకులిచ్చి నువ్వు నన్ను చేసుకున్నావే అనుకో-ఓ సంవత్సరం ఆనందంగా ఉండగలమేమో. ఆ తర్వాత అందరిలా మనమూ ప్రవర్తించగలమన్న గ్యారంటీ లేదు."

నవీన్ ఆశ్చర్యంగా వింటున్నాడు.

"నీకు షాకింగా అనిపించవచ్చు. నువ్వంటే నాకిష్టమే. నీ భావుకత, నీ కవిత్వం, నీ అమాయకత్వం అన్నీ చాలా చాలా ఇష్టం నాకు. అంత మాత్రాన నిన్ను స్వంతం చేసుకున్నానే అనుకో - జీవితంలో మొదటిసారి తాజ్‌మహల్ చూసిన వాడికీ - ఆగ్రాలో వుంటూ రోజూ చూసేవాడికీ ఉన్నంత తేడా ఉంటుంది."

అతడిని చూసి నవ్వింది.

ఆ నవ్వులో మునుపటి అందం కనిపించ లేదతనికి.

**అంధులు కూడా చిత్ర కారులు కావచ్చు!**

ఫ్రాన్స్‌లో పుట్టిన లూయి బ్రెయిల్ అనే ఆయన అంధులకోసం చదవటానికి, రాయటానికి ఒక ప్రత్యేకమైన లిపిని తయారు చేసి చరితార్థుడయాడు. బ్రెయిల్ లిపి వలన ఎందరో అంధులు చదువుకుని, మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ బ్రతుకుతున్నారు. ఇప్పుడు గ్రుడ్డి వాళ్ళు బొమ్మలు కూడా వేయవచ్చుట. ఫ్రాన్‌కి చెందినవారే ఇద్దరు యువకులు ఈ అసాధ్యాన్ని సాధ్యం చేసారు. వీరు ఒకరకం కలాన్ని కనిపెట్టారు. దీనితో బొమ్మ గీసినప్పుడు, రెండు నిమిషాల తర్వాత సిరాతో గీసిన ఆ గీతలు కాగితం మీద ఉబ్బి, అంధులు చేతితో తడిమితే ఆ రూపం గ్రహించటానికి వీలుగా ఉపయోగకరంగా ఉంటాయి. అంధులను చిత్రకారుల్ని చేసే ఈ ప్రత్యేకమైన కలం, జెనీవాలో ఏర్పరచబడిన ఒక ఎగ్జిబిషన్‌లో, ప్రదర్శించబడింది. దీన్ని కనిపెట్టిన ఆ యువకులకు బహుమతీ లభించింది.

— మంకర

ముగ్ధత్వం, స్నిగ్ధత్వం ఇంకే అందాలూ కనిపించ లేదు. మెచ్యూరిటీ!!

కొన్ని వందల జీవితలను పరిశీలించి పరిశోధించిన వేదాంతి నవ్వులా కనిపించే పరిపక్వత.

"అలాగే నేను నీకు వెన్నెల బొమ్మనే - కావొచ్చు. ఈ వెన్నెల బొమ్మ మెడలో తాళిగట్టి ఇద్దరం ఒకే చోట ఎప్పుడూ కలిసుంటే, అమావాస్యలేని వెన్నెల కెంత విలువుందో నాకూ అంతే ఉంటుంది. కాదంటావా?

అతని తల తిరిగిపోతోంది.

అప్పుడు చూశాడతను.

టీపాయ్ మీద ఆర్ట్‌పేపర్లో ప్రింట్ చేసున్న వెడ్డింగ్ కార్డు అందుకుని చూశాడు.

"జ్యోతిర్మయి వెడ్స్ కృష్ణారెడ్డి"

"క్రిష్ణారెడ్డికి నేను వెన్నెల బొమ్మను కాను. క్రిష్ణశాస్త్రి, తిలక్‌ల కవిత్వాన్ని కాదు. కేవలం భార్యను. ఓ పదేళ్లు కాపరం చేశాక నా మీద బోర్ కొట్టి ఇంకొక స్త్రీతో కాంటాక్ట్ పెట్టుకోవచ్చు. నేను బాధపడను. ఎందుకో తెలుసా? రోజూ తాజ్‌మహల్ చూసేవాడు చార్మినార్ చూడాలనుకోవటం తప్పుకాదని నా ఉద్దేశం. పదేళ్లు మనిద్దరం కాపురం చేశాక నువ్వు వేరే స్త్రీతో సంబంధం పెట్టుకుంటే అప్పుడు ఇద్దరికీ బాధ. ఎందుకో తెలుసా?"

చిన్నగా నవ్వి అంది.

"ప్రేమికులం - సారీ మాజీ ప్రేమికులం గనుక."

జ్యోతిర్మయి పూర్తిగా అర్థమైందతనికి.

ఇప్పుడతనికి టెన్షన్‌లేదు. బాధలేదు - ఏదో కోల్పోతున్న ఫీలింగ్ అంతకన్న లేదు.

"జ్యోతీ"

అతని పెదవుల మీద నవ్వుని చూసి అంది జ్యోతిర్మయి.

"మరపు అనేది దేవుడిచ్చిన వరం అనుకుంటాం గానీ - అది శాపం అంటాను నేను. మనస్సు కలత చెందినప్పుడు నిద్రపట్టని ఓ రాత్రివేళ - కిటికీలోంచి కనిపించే నీలాకాశంలో కృష్ణపక్షపు చంద్రుని చూసినప్పుడు నువ్వు గుర్తొస్తావ్. ఆ క్షణంలో నువ్వేం చేస్తుంటావోనన్న ఆలోచన బాధలో తీయని ఆనందం. ఆ ఆనందాన్ని పెళ్లి పేరుతో విషాదం చేసుకోవటం అన్యాయం కదూ.

"అవును అన్యాయమే" హిప్నటైజ్ చేయబడిన సబ్జెక్ట్‌లా అన్నాడతను.

ఓ అరగంట అనంతరం.

లేచి నిల్చున్నాడు నవీన్.

"వెళ్తున్నావా" అంది జ్యోతిర్మయి.

"అవును" ఆమెను చూస్తూ అన్నాడు.

ఆమె లేచి నిల్చుంది.

హంపీ కన్యకు ఆరెంజ్ కలర్ చీరెకట్టినట్టు...

నెమ్మదిగా అతని దగ్గరకొచ్చి

అతని భుజాలమీద చేతులేసి...

మునివేళ్ల మీద నిలబడి,

అతని పెదవులు అందుకుని -

అతని మనస్సు ఆనందం భరించలేక ఆత్మహత్యకు సిద్ధమవుతుంటే విడివడిన పెదవుల మధ్య తళుక్కున మెరిసినట్టు నవ్వి అంది జ్యోతిర్మయి.

"వెళ్లిరా నేస్తం - ఈ అనుభూతిని కలకాలం మన గుండెల్లో పదిలపర్చుకుందాం- అమావాస్యలను పూర్ణిమలు చేసుకుందాం - గ్రీష్మాలను వసంతాలుగా మార్చుకుందాం - శలవ్...."